## క్లుప్తంగా

### ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య



విద్యార్థులను అభినందిస్తున్న పీహెచ్‌పీ నాయకులు

నెల్లూరు(అర్బన్) : ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతోందని పీహెచ్‌పీ అసోసియేషన్ అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, 25వ వార్డు కార్పొరేటర్ బద్దెపూడి గిరి అన్నారు. స్థానిక బుజబుజనెల్లూరులోని ప్రభుత్వ డీవీఎస్ఎం జెడ్పీ పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో తెలుగు సబ్జెక్టులో 90 మార్కులకు పైగా సాధించిన 35 మంది విద్యార్థులకు పీహెచ్‌పీ ఆధ్వర్యంలో అభినందన సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానం పొందిన విద్యార్థికి రూ.1,116ల నగదుతో పాటు జ్ఞాపికను అందించారు. అలాగే ఇతర విద్యార్థులకు తెలుగు భాషోపాధ్యాయ సమితి ప్రధాన కార్యదర్శి బద్దిపూడి శ్రీనివాసులు జీప్ ఫైల్స్, తెలుగు ఉపాధ్యాయుడు అచ్యుతమణి జ్ఞాపికలు అందజేసి అభినందించారు. పాఠశాలలో ఉత్తీర్ణత పెరగడానికి కారణమైన ఉపాధ్యాయులు అచ్యుతమణి, మంజుల, రవీంద్రలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మల్లికార్జునరావు, పెద్దాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు బ్రహ్మారెడ్డి, దూడల ప్రసాద్‌రావు, షబ్బీర్, ఉపాధ్యాయులు ప్రసాద్, సమీవుల్లా, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

### ఇస్కాన్‌సిటీలో '25 కళా సంఘాల' స్టూడియో



స్టూడియోను ప్రారంభిస్తున్న అతిథులు

నెల్లూరు (బృందావనం) : నగరంలోని ఇస్కాన్ సిటీలో 25 కళా సంఘాల సినీ స్టూడియోను ఆ సంఘ అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి, హైటెక్ ఫార్మా అధినేత రమణారెడ్డి, నారాయణ గ్రూపు హాస్పిటల్స్ ఏజీఎం సీహెచ్ భాస్కర్‌రెడ్డి, సినీ నిర్మాత సంషుద్దీన్ తదితరులు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అమరావతి కృష్ణారెడ్డి మాట్లాడుతూ సినిమా హబ్‌గా మారుతున్న నెల్లూరులో సినిమా షూటింగ్‌లు చేసుకోవడానికి అనువుగా సినీ స్టూడియోను నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో 25 కళా సంఘాల కన్వీనర్లు దోర్నాల హరిబాబు, అమీర్‌జాన్, నేదురుమల్లి హరనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా పోలూరి శత జయంతి



హనుమజ్జానకీరామశర్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

నెల్లూరు (బృందావనం) : నగరంలోని పురమందిరం ప్రాంగణం వర్ధమాన సమాజం హాల్లో పద్యకళా పరిషత్ ఆధ్వర్యంలో ఆంధ్ర వాల్మీకి పోలూరి హనుమజ్జానకీరామశర్మ శత జయంతి ఉత్సవాల 8వ సమావేశం ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రచించిన తిక్కన సోమయాజి నాటకంపై చీమకుర్తి వెంకటేశ్వరరావు ఉపన్యసించారు. తొలుత హనుమజ్జానకీరామశర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మెట్టు రామచంద్రప్రసాద్, వేదం రాధాకృష్ణమూర్తి, కోట రాజశేఖర్, పోలవరపు లక్ష్మీనరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

### త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ప్రచారం చేస్తున్న సమితి సభ్యులు

నెల్లూరు (బృందావనం) : జ్యేష్ట పౌర్ణమిని పురస్కరించుకుని త్రైత సిద్ధాంతం- ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక నెల్లూరు కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని పడారుపల్లిలో త్రైత సిద్ధాంత భగవద్గీత గురించి ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ కమిటీ నగర అధ్యక్షుడు సూరమౌళి మాట్లాడుతూ జ్యేష్ట పౌర్ణమి విశిష్టతను వివరిస్తూ ప్రచారం చేశామన్నారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాల గురించి ప్రజలకు తెలియజేశామన్నారు. ధర్మస్థాపనే త్రైత సిద్ధాంత ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో సభ్యులు కోటేశ్వరరావు, విజయమ్మ, మోహన, నాగార్జున, వేణు, ప్రవీణ, సుమలత తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుపైనే వ్యాపారం.. ప్రజలకు నరకం



సగం రోడ్డు కిటకిటలాడడంతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



నగరంలోని మినీ బైపాస్‌రోడ్డు వనంతోపు సెంటర్‌లో ప్రధాన రహదారిపై అనధికారికంగా ఏర్పాటు చేసుకున్న చేపల దుకాణాలతో ప్రతి రోజూ ఉదయం వేళల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ప్రతి రోజు చేపల విక్రయాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ఆదివారం మధ్యాహ్నం వరకు చేపల విక్రయాలతో రద్దీ ఎక్కువగా ఉంటుంది. కొనుగోలుదారులు తమ వాహనాలను రోడ్డు పక్కనే నిలిపి విక్రయాలు చేస్తున్నారు. దీంతో సగం రోడ్డు వాహనాలు, ప్రజలతో కిక్కిరిసిపోవడంతో రాకపోకలు కష్టతరంగా మారింది. నగరపాలక సంస్థ అధికారులు చేపల దుకాణదారులను ప్రత్యామ్నాయ ప్రాంతానికి తరలించి, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



రోడ్డుపైనే నిలిపివేసిన వాహనాలు



రోడ్డు పక్కన జోరుగా సాగుతున్న చేపల విక్రయాలు

## విద్యార్థులకు కలెక్టర్ పరామర్శ



విద్యార్థుల ఆరోగ్యం గురించి ఆరాతీస్తున్న కలెక్టర్

నెల్లూరు(అర్బన్) : నగరంలోని జయభారత్ ఆస్పత్రిలో డయేరియా లక్షణాలతో చికిత్స పొందుతున్న చెన్నూరు ట్రైబల్ హాస్టల్ విద్యార్థులను కలెక్టర్ హరినారాయణన్ ఆదివారం స్వయంగా పరామర్శించారు. వారితో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం బాగుందన్నారు. విద్యార్థులకు వైద్యపరంగా కావాల్సిన పూర్తి సహకారం అందించాలని జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ పెంచలయ్యను, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మందా రాణిని ఆదేశించారు. చిన్నారులు పూర్తిగా కోలుకునే వరకు అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. జిల్లాలో డయేరియా ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో గూడూరు ట్రైబల్ వెల్ఫేర్ అధికారి బేబీరాణి, డాక్టర్లు సీవీ సుబ్రహ్మణ్యం, వెన్నల, ఆస్పత్రి డిప్యూటీ మేనేజర్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

### పీఎం మోదీ రాజీనామా చేయాలి

నెల్లూరు (టౌన్) : నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు బాధ్యత వహించి ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాజీనామా చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వెంకటరాజు, తిరుమలయ్య ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈనెల 23న జరగాల్సిన నీట్ పీజీ పరీక్షను అర్ధాంతరంగా వాయిదా వేశారన్నారు. విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటున్న ప్రధాని మోదీ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

### ప్రజా సమస్యలను తెలియజేయండి

నెల్లూరు(బారకాసు) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను తెలియజేయాలని కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ మీటింగ్ హాల్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదులు చేయవచ్చని తెలియజేశారు. అందిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కారం అందించేందుకు అన్ని విభాగాలను సమన్వయం చేసుకుని కృషి చేస్తామని కమిషనర్ పేర్కొన్నారు.

## కార్యకర్తలకు భరోసా కల్పించేలా..



పార్టీ నాయకులతో చర్చిస్తున్న ఆదాల, కాకాణి

- భవిష్యత్ కార్యాచరణపై కాకాణి, ఆదాల భేటీ

నెల్లూరు సిటీ : సర్వేపల్లి, నెల్లూరు రూరల్ నియోజకవర్గాల పరిధిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, సానుభూతిపరులకు భరోసా కల్పించేలా చేపట్టే కార్యక్రమాలపై మాజీ మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్ రెడ్డి చర్చించారు. నెల్లూరు నగరంలోని డైకాస్ రోడ్డు సెంటర్‌లో ఉన్న కాకాణి నివాసంలో ఈ మేరకు వారు ఆదివారం భేటీ అయ్యారు. ఎన్నికల ఫలితాల అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులపై అధికార పార్టీ నేతలు చేస్తున్న హింసాత్మక దాడుల నేపథ్యంలో వారికి అండగా ఉండేందుకు, భరోసా కల్పించేందుకు చేయాల్సిన కార్యాచరణపై చర్చించారు. తీవ్ర భయాందోళనకు గురవుతున్న వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులకు అన్నివిధాలా అండగా ఉండేందుకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నాయకుల సమష్టి సహకారంతో ముందుకు వెళ్లేందుకు ఎలాంటి ప్రణాళికలు రూపొందించాలో ఈ సందర్భంగా చర్చించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులకు ఇబ్బంది కలిగినా, నష్టం వచ్చినా అన్నివిధాలా ఆదుకునేందుకు జిల్లా నాయకత్వం సిద్ధంగా ఉండేలా చేపట్టాల్సిన చర్యలపై భేటీలో చర్చించినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు మల్లు సుధాకర్‌రెడ్డి, పార్టీ నాయకులు చెన్నారెడ్డి హరిచంద్రారెడ్డి, కొండా సాయిరెడ్డి, సుబ్బారెడ్డి, సీహెచ్ సూరిబాబు, ఆదిరెడ్డి, చంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

## వాకర్స్‌కు ఉచిత వైద్యశిబిరం



వాకర్స్‌కు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్లు

నెల్లూరు(బృందావనం) : నగరంలోని పొదలకూరు రోడ్డులో ఉన్న జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జెడ్పీ వాకర్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్టు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ పొదలకూరురోడ్డు పద్మావతి సెంటర్‌లోని ఎంఎస్సార్ హాస్పిటల్ సౌజన్యంతో వైద్యులు రోహిత్, ఆర్వీ జ్యోత్స్న, ఎం.వెంకటేశ్వర్లు, బి.శ్రావణికృష్ణ వారి సిబ్బంది వాకర్స్‌కు బీపీ, రక్త, దంత, కీళ్ల పరీక్షలు చేసినట్లు తెలియజేశారు. తగిన వైద్య సలహాలతో పాటు ఉచితంగా మందులను అందజేశారన్నారు. వాకర్స్‌కు తలెత్తిన సందేహాలను వైద్య బృందం నివృత్తి చేసినట్లు వివరించారు. వాకర్స్ ఆరోగ్య సంరక్షణ రీత్యా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఖాజామస్తాన్, కోశాధికారి యు.చెంచయ్య, ఎమ్వీ కృష్ణయ్య, సీఎల్ ప్రసాద్, బి.రాజగోపాల్, మేరీ బ్లెస్సింగ్టన్, హరిసుధా పాల్గొన్నారు.

### ఏసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో..

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు, అవగాహన సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూరాలజిస్ట్ డాక్టర్ యామిని పలు వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం షుగరు, బీపీ పరీక్షలు నిర్వహించారు. చర్మవ్యాధి నిపుణుడు డాక్టర్ హర్షవర్ధన్, అసోసియేషన్ కార్యదర్శి నజీర్ అహ్మద్, కోశాధికారి సుబ్బరాయుడు పాల్గొన్నారు.

### యోగా గురువు ప్రసన్నకు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న ప్రసన్నకుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : నెల్లూరుకు చెందిన యోగా గురువు ప్రసన్నకుమార్ ఉత్తమ యోగా గురువు పురస్కారం అందుకున్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా తమిళనాడు స్పోర్ట్స్ యోగా అసోసియేషన్, మహిళా జైన్ కాలేజీ సంయుక్తంగా ఆంధ్ర, కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన ఉత్తమ యోగా గురువులకు శనివారం రాత్రి పురస్కారాన్ని అందజేశారు. ఈ క్రమంలో ప్రసన్నకు కూడా పురస్కారం వరించింది. దీంతో నెల్లూరు నగరంలో ఆదివారం పలువురు హర్షం వ్యక్తం చేశారు

## ముగిసిన ఏపీ సీసీబీఏ సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఏపీ సీసీబీఏ నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : ఆంధ్రప్రదేశ్ కో–ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్(ఏపీ సీసీబీఏ) రాష్ట్రస్థాయి సమావేశాలు ఆదివారం ముగిశాయి. నగరంలోని హోటల్ రాయల్‌లో జరిగిన సమావేశాల్లో బ్యాంకు ఉద్యోగులకు రావాల్సిన పే రివిజన్, పెన్షన్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, రోజువారీ ఉద్యోగులను పర్మనెంట్ చేయడం లాంటి విషయాలపై చర్చించారు. అదేవిధంగా సర్వీస్ రెగ్యులేషన్, బ్యాంక్ ఫైనాన్స్, రుణాల రికవరీ, సొసైటీలో కంప్యూటరీకరణ లాంటి అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో నష్టాల్లో ఉన్న జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు (డీసీసీబీ), ప్రాథమిక సహకార సంఘాలు(పీఏసీఎస్)లను ఏ విధంగా లాభాల బాటలో పయనింపజేయాలో, అందుకు ఉద్యోగులు, అసోసియేషన్ అందించాల్సిన సహకారం గురించి చర్చించి నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో ఏపీటీబీఈఎఫ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ బీఎస్ రాంబాబు, ఏపీ సీసీబీఏ చైర్మన్ మాధవరావు, వైస్ చైర్మన్‌లు రాధాకృష్ణమూర్తి, రామారావు, మాజీ జనరల్ సెక్రటరీ ప్రసాద్, జనరల్ సెక్రటరీ రవికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ నారాయణరెడ్డి, సెక్రటరీ సుమన్, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, ఉషారాణి, ఉదయ్‌కుమార్, దయాకర్‌రెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర నేత దామా అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాద బాధితులకు సాయం



నిత్యావసర సరుకులను అందజేస్తున్న దాతలు

నెల్లూరు (టౌన్) : బర్మాషెల్‌గుంటలోని అగ్నిప్రమాద బాధితులకు సహృదయ సేవా సమితి ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసర సరుకులను ఆదివారం వితరణ చేశారు. సేవాసమితి నిర్వాహకుడు కారుమంచి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయుడు ఫణికుమార్ ఆధ్వర్యంలో బాధితులకు పది కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు, అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అగ్నిప్రమాద బాధితులకు సాయం చేసేందుకు దాతలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో రాము, శ్రీనివాసులు, వరప్రసాద్, సుబ్బారావు, రవికిరణ్, మల్లికార్జున్, హజరత్తయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

### టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ల జిల్లా కార్యవర్గం ఎన్నిక



నెల్లూరు (పొగతోట) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టైపిస్ట్ అండ్ స్టెనోగ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం రూరల్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కేవీ రమణయ్య, కార్యదర్శిగా సురేంద్రబాబు, కోశాధికారిగా పి.ప్రమీలా, వైస్ ప్రెసిడెంట్లుగా సి.రామకృష్ణ, కె.సునీల్‌కుమార్‌రెడ్డి, అడిషనల్ సెక్రటరీలుగా కరుణాకర్, సత్యనాగసాయి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఏసు, కార్తీక్ తదితరులు ఎన్నికయ్యారు. సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి శంకర్‌నాయక్, రాష్ట్ర నేత బి.సురేష్‌బాబు హాజరు కాగా ఎన్నికల అధికారిగా బ్రహ్మానందరెడ్డి వ్యవహరించారు. సమావేశానికి జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న స్టెనోగ్రాఫర్లు, టైపిస్టులు హాజరయ్యారు.

## విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

నెల్లూరు (బృందావనం) : నగరంలోని పురమందిరంలో నగరపాలక సంస్థ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో ప్రథమ స్థానంలో నిలిచిన 36 మంది విద్యార్థులకు ఆదివారం రాత్రి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. టౌన్ హాల్ ట్రస్టు బోర్డు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ సీహెచ్ పెంచలరెడ్డి విచ్చేసి విద్యార్థులకు రూ.5 వేల చొప్పున నగదు బహుమతితో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను అందించారు. కార్యక్రమంలో టౌన్ హాల్ ట్రస్టు బోర్డు సభ్యులు వాకాటి విజయకుమార్‌రెడ్డి, రేబాల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జె.భక్తవత్సల్‌రెడ్డి, నేతాజీ సుబ్బారెడ్డి, సి.వివేకానందరెడ్డి పాల్గొన్నారు.

### శ్యామా ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి

నెల్లూరు(మినీబైపాస్) : భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని శివాజీ సెంటర్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. అనంతరం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మోర్చాల సమన్వయకర్త పి.సురేంద్రరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్ రెడ్డి, నాయకులు రాజ్ పురోహిత్, యశ్వంత్‌సింగ్, కేవీ సుబ్రహ్మణ్యం, బీఎస్ రంగరాజన్, భాస్కర్‌రావు, బాలసుబ్రహ్మణ్యం, మూర్తి, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## అవయవ దానంపై అపోహలు వీడాలి



నెల్లూరు(అర్బన్) : మాట్లాడుతున్న సింహపురి అవయవదాన సంస్థ కమిటీ నేతలు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : మాట్లాడుతున్న సుకుమార్‌రెడ్డి

- సింహపురి అవయవ దాన సంస్థ కన్వీనర్ విజయ

నెల్లూరు(అర్బన్) : మరణించి కూడా ఎంతో మందికి ప్రాణదానం చేసే గొప్ప పుణ్యకార్యం అవయవ దానమని, దానిపై ఉన్న అపోహలను ప్రజలు వీడాలని సింహపురి అవయవ దాన సంస్థ నూతన కన్వీనర్, విశ్రాంత ఉపాధ్యాయిని విజయ అన్నారు. మద్రాస్‌బస్టాండ్ సమీపంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ కార్యాలయంలో సింహపురి అవయవ దాన సంస్థ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 16 మంది సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంస్థ కన్వీనర్‌గా పీ విజయ, ఎంసీ మెంబర్లుగా రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల డాక్టర్ ఎమ్వీ రమణయ్య, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కాలేషా, న్యాయవాది బ్రహ్మం, రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు కన్వీనర్ అజయ్‌బాబు తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్త, అవయవ, దేహ, నేత్రదానాలపై ప్రజలను చైతన్యవంతం చేయడమే ధ్యేయంగా పని చేస్తామన్నారు. ప్రజల వద్ద నుంచి సమాచారం అందినప్పుడు వారికి అండగా ఉండి ఈ అవయవ, నేత్ర, దేహ, రక్తదానాలను చేయిస్తామన్నారు. తద్వారా ఆపదలో ఉన్న ఎంతోమందికి ప్రాణదానం చేసేందుకు కృషి చేస్తామన్నారు.

### అవయవ దానంపై అవగాహన

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో అవయవ దానంపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. పినాకిని బాడీ డోనర్స్ వ్యవస్థాపకుడు తిక్కవరపు సుకుమార్‌రెడ్డి అవయవ దానంపై జరిగే మేలును వివరించారు. వివేకానంద వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు మేకల నరేంద్రరెడ్డి, అధ్యక్ష, కార్యదర్శులు డీవీ సుబ్బరాజు, రమేష్‌బాబు, వాకర్స్ మాజీ గవర్నర్లు రాఘవేంద్రశెట్టి, కేఎంకే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పరిమళించిన మానవత్వం



ఆశ్రమంలో పెరిగిన యువతికి నిశ్చితార్థం జరిపిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం) : నగరంలోని కొండాయపాళెం రోడ్డు వనంతోపు సెంటర్‌లో ఉన్న జనహిత–వాత్సల్య ఆశ్రమం మానవత్వం పరిమళించే కార్యక్రమానికి వేదికైంది. ఆశ్రమంలో పెరిగిన యువతికి ఓ ప్రభుత్వ ఉద్యోగితో నిశ్చితార్థ వేడుక ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు మాట్లాడుతూ జనహిత వాత్సల్య ఆశ్రమానికి చెందిన తల్లిదండ్రులు లేని యువతి చిద్రూప లక్ష్మి, విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న నాయుడుపేటకు చెందిన సుమన్‌తో నిశ్చితార్థం జరిగిందన్నారు. అనంతరం ఆదర్శ వివాహం చేసుకోనున్న వరుడిని అభినందించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు జీవీ సాంబశివరావు, విశ్రాంత ఉద్యోగులు పుల్లారెడ్డి, నిర్వాహకులు అరవ పరిమళ, బి.పరిమళ, ఆడిటర్ దుర్గాప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.